# మీరు చదివారా?





## - కృష్ణవేణి

(నెలనెలా ఓ పుస్తకం - సమగ్రపరిచయం)


# *Clear Light of Day*



అనితా దేశాయ్ పుట్టినది 1937లో, ముస్సోరీలో. చదువుకున్నది ఢిల్లీ యూనివర్సిటీలో. పై చదువు కొనసాగించినది కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో. ఇప్పుడు కేంబ్రిడ్జ్ 'జాన్ యీ బర్చర్డ్ అకాడెమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్' లో, ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.
ఆమె రాసిన పుస్తకాల్లో 'ఫైర్ ఆన్ ద మౌంటెన్' (1977) కి వినిఫెడ్ హోల్బీ మెమోరియల్ ప్రైజ్ వచ్చింది. 'ఇన్ కస్టడీ(1984) మరియు 'ఫాస్టింగ్, ఫీస్టింగ్' (1999), నవలలు బుకర్ ప్రైజుకి షార్టులిస్ట్ అయాయి. 'ఇన్ కస్టడీ' పుస్తకాన్ని మర్చంట్ ఐవరీ ప్రొడక్షన్స్, సినిమాగా తీసింది.

దేశాయ్ నవలలూ, షార్ట్ స్టోరీలూ- సంఘటలనూ, మనోభావాలనూ కళ్ళముందు కదలాడేలా చేస్తాయి. ఆమె పుస్తకాల్లో వీరోచిత పాత్రలు ఉండవు. స్త్రీల అణిచివేత, గుర్తింపు కోసం పాకులాట, కుటుంబ సంబంధాలు, మరుగవుతున్న సాంప్రదాయాలు- ప్రధాన ఇతివృత్తాలయి ఉంటాయి. పద్మభూషణ్ గ్రహీత ఆమె. 'క్లియర్ లైట్ ఆఫ్ దే' పబ్లిష్ అయినది 1980లో.

★★★




కథ సుమారు 1970లలో ప్రారంభం అవుతుంది. తారా దాస్, యుఎస్‌లో ఇండియన్ అంబాసడర్ అయిన బకుల్ భార్య. వాషింగ్టన్ నుంచి ప్రతీ ఏటా వచ్చినట్టే, వారి కుటుంబం పాత ఢిల్లీకి, తారా అక్కయిన బిమ్లా(బిమ్) వద్దకి వచ్చి, ఆ పాడు పడుతున్న ఇంట్లో ఉంటుంది. బిమ్‌తో పాటు ఆటిస్టిక్‌గా పుట్టిన తమ్ముడు బాబా ఉంటాడు. ఏనాడూ ఇల్లు వదలని ఆ అక్కా తమ్ముళ్ళ ఉనికి తారాను కలవరపెట్టినప్పుడు, *'ఏదీ మారలేదెందుకు? నేను మారానే!'* అని మధన పడుతుంది. తల సగం నెరిసిన బిమ్ వృత్తి హిస్టరీ బోధించడం. రోజంతా గ్రామఫోన్లో, 1930ల సంగీతం వినే బాబాను చూసుకుంటుంటుంది.

తినగా మిగిలిపోయిన ఆహారపదార్థాలన్నిటినీ బిమ్ గోకి తీసి, సాసర్లలో మర్నాటికని పెడుతుందని చూసిన తారా అది బకుల్‌కు తెలుస్తుందేమోనని చిరాకు పడుతుంది. ఏదీ మారనందుకు చిరాకు పడుతుంది. *'నా బాల్యపు, యవ్వనపు మందత్వం, గదిలో ఉన్న మట్టి కొట్టుకున్న కార్పెట్ల కిందనా, పచ్చబడి ఉన్న ఫోటోల వెనుకాతలా, కిలుమెక్కిన ఇత్తడి సామాన్ల మధ్యా దాగుంది. నేను చిన్నపిల్లగా ఉన్నప్పుడు అసహ్యించుకున్న ప్రతీదీ ఇక్కడే జాగ్రత్తగా పెట్టి ఉంది.'*

*'పాత ఢిల్లీ మారదు. అది శిధిలం అవుతుందంతే. ఇది గొప్ప శ్మశానవాటిక అని నా స్టూడెంట్స్ చెప్తారు. ప్రతీ ఇల్లూ ఒక సమాధే.'* అంటుంది బిమ్లా.

ఢిల్లీ వేసవి తారాకి చిరాకు కలిగించినప్పుడు, గతపు ఛాయలు ఆమెని చుట్టుముడతాయి. భారతదేశపు విభజన సమయంలోనే బాబా పుట్టిన తరువాత మొదట, తల్లి మరణిస్తుంది. ఆ తరువాత, తండ్రి ఏక్సిడెంట్లో చనిపోతాడు. తల్లితండ్రులు తరచూ నైట్ క్లబ్బులకు వెళ్తూ పిల్లలని పట్టించుకోకపోవడం వల్ల పిల్లలకి కూడా వారి లోటు అంతగా కనిపించదు. విధవరాలైన పిన్ని మీరా చిన్నప్పుడు వారి బాగోగులు చూసుకునేది. తాగుడు అలవాటు వల్ల అనారోగ్యంతో ఆమె కూడా చనిపోతుంది. అందరిలో పెద్దవాడైన రాజా, బిమ్ అన్యోన్యంగా ఉండేవారు. అతనికి టిబి సోకినప్పుడు బిమ్ నిస్వార్థంగా సేవ చేస్తుంది. వారి ఇంటి యజమానీ, పొరుగింటివాడూ అయిన హైదర్ అలీ, రాజాను తన హైదరాబాదు ఇంటికి ఆహ్వానించినప్పుడు మతపరమైన ఉద్రిక్తతను తప్పించుకోడానికి రాజా అక్కడికి వెళ్ళి ఉర్దూ ఇష్టపడ్డం ప్రారంభించి, అలీ కూతురిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు. తారా పొరిగింటి మిత్రాలతో సమయం గడుపుతూ బకుల్‌తో ప్రేమలో పడి, అతన్ని పెళ్ళి చేసుకుని పట్టణం వదిలి వెళ్ళిపోతుంది. బిమ్, బాబా వొంటరిగా మిగులుతారు.

బిమ్ అనేకసార్లు ఒక డాక్టర్ను కలుసుకున్నప్పటికీ అతను ఆసక్తికరమైన వాడు కాదనుకుని ఆ సంబంధాన్ని వదిలి వేస్తుంది. అక్కాచెల్లెళ్ళు, రాజా గురించి మాట్లాడుకుంటారు. తారా వచ్చినది అతని కూతురి పెళ్ళికే.

రాజా– బిమ్‌కి, *'అద్దేమీ ఎక్కువ చేయనులే'* అని ఉత్తరం రాస్తాడు. *'నేను తన మామగారి ఇంట్లో ఉండటం వల్ల అన్న ఇంటి అద్దె పెంచాలేదు. ఇంటిని అమ్మాలేదు. ఎంత త్యాగమో?'* అనుకున్న బిమ్ అది క్షమించలేకపోయి, పెళ్ళికి వెళ్ళనంటూ భీష్మించుకుని కూర్చుంటుంది. బిమ్ ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేదని తెలిసిన తారా, రాజాతో బిమ్‌కున్న సమస్యేమిటో చెప్పమని నిలదీస్తుంది. బాబా బాధ్యత రాజా, తారా కలిసి కేవలం తనమీదే వదలడం బిమ్‌కు కోపం తెప్పించి, బాబా మీద కూడా కేకలు పెడుతుంది. ఆ కోపానికి బాబా

స్పందించకపోయినప్పుడు ఆమె కోపం చల్లారి, పశ్చాత్తాపపడుతుంది. చివరికి, కుటుంబంలో జరిగిన పొరపాట్లన్నీ ప్రేమ వల్ల కప్పడుతాయని గ్రహించినప్పుడు, మిత్రాలతో పాటు సంగీత కచ్చేరీకి వెళ్ళి, ఆ కుటుంబంలో ఉన్న అన్యోత్యనని గమనిస్తుంది. తారా రాజా కూతురి పెళ్ళికి వెళ్తుంది. అన్నను క్షమించడానికి సిద్ధంగా ఉన్న బిమ్, రాజాని ఇంటికి తెమ్మని తారాని అడుగుతుంది.

★★★

పుస్తకంలో పునరావృతమయే ఇతివృత్తం సంగీతం. అది వినే బాబాయేకాక, బిమ్ కొంతకాలం కలిసి తిరిగిన డాక్టర్ కూడా వయొలిన్ మీద పాశ్చాత్య శాస్త్రీయ సంగీతం వాయించేవాడు. మొజార్ట్ అంటే చెవి కోసుకునేవాడు. అతని తల్లి రొబీంద్ర సంగీత్ పాడే స్త్రీ. పొరుగింటి యువకుడికి భారతీయ శాస్త్రీయ సంగీతమంటే ఇష్టం. రాజా ఆసక్తి ఉండేది ఎలియట్, బైరన్, టెనిసన్ మీద. అతను తన అభిరుచులని బిమ్‌తో పంచుకునేవాడు. కనుక, కవిత్వం మరొక ఇతివృత్తం.

పుస్తకం– కుటుంబంలో కనిపించే తోబుట్టువుల మధ్యనుండే పోటీ, అపరాధభావం, నిస్పృహ, అల్పమైన ఈర్ష్యలు, బాల్యంలో చవి చూసిన క్రూరత్వం పెద్దయిన తరువాత కూడా వెంటాడటం, వయస్సు ఎక్కువవుతున్నప్పుడు వచ్చే మార్పుల గురించినది. కుటుంబం వేరు పడ్డం గురించేకాక నవల మనకి దేశ చరిత్ర గురించి కూడా చెప్తుంది. భారతదేశపు విభజన పరిగణించతగ్గ యదార్థం. అది రాజా ఇల్లు విడవడం, తారా పెళ్ళి చేసుకోవడం, దాస్ దంపతుల/మీరా మరణాలతో సమకాలీనమైనది. నవల్లో కనిపించే కుటుంబపరమైన వేర్పాట్లు, విభజనకు దారి తీసిన సామాజిక సంఘటనలకి సమానాంతరంగా నడుస్తాయి. ఇండియానుండి పాకిస్తాన్ వేరయినప్పుడు సంభవించిన సామాజిక తిరుగుబాటు వివరాలుంటాయి.

పూర్తి పుస్తకం ప్రధమ పురుషలో ఉంటుంది. మానని కుటుంబ గాయాల సార్వత్రిక కథ ఇది. తోబుట్టువుల చరిత్ర పాకిస్తాన్‌కు ఇండియాతో ఉన్న సంబంధాన్ని పోలుస్తుంది. పాత్రలు కోల్పోయిన అవకాశాలు, బాధ, త్యాగం కనబడతాయి దీన్లో. *'ఒకరి అవసరాలని మరొకరు గుర్తించి, కలిసే ఉంటే జీవితమెంత భిన్నంగా ఉండేదో!'* అన్న తలంపుల గురించినది. తప్పులను క్షమించి మరచిపోగలిసే సామర్థ్యం, కుటుంబం అనుభవించిన పరీక్షల/కష్టాల గురించి దేశాయ్ రాస్తారు.

నాలుగవ భాగంలో ఉన్న ఒక పేరాలో గతానికి బానిస అయిన బిమ్లా, పరిణితి చెంది, 'స్పష్టమైన *కాంతిలో'* ప్రపంచాన్ని చూసినప్పుడు, *'నొప్పి కలిగినప్పుడు, అందరిపైనా ప్రేమా అభిమానం తప్ప ఇంకేదీ కనబడదు.'* అనే స్థితికి చేరుకుంటుంది.

'క్లియర్ లైట్ ఆఫ్ డే' మాన్ బుకర్ ప్రైజుకి షార్టులిస్ట్ అయింది. నాలుగు అధ్యాయాలున్న పుస్తకంలో–ప్రధాన పాత్రలన్నీ పెరిగి పెద్దవయి, వెనక్కి తిరిగి తమ బాల్యాల్లోకి తొంగి చూసిన తరువాత, ప్రస్తుత కాలానికి తిరిగి వస్తుంది.

★★

COMMENTS